క్లుప్తంగా

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

భవన నిర్మాణ పనుల కోసం డ్రైనేజీ ధ్వంసం


ధ్వంసమైన డ్రైనేజీ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు తిమ్మాపురంలో తన భవన నిర్మాణం పనుల కోసం దానికి ఆనుకుని ఉన్న డ్రైనేజీని ఓ వ్యక్తి ధ్వంసం చేశాడు. ఇక్కడ డ్రైనేజీ కొంత మేర ధ్వంసం కాగా మరి కొంత భాగంలో నిర్మాణ సామగ్రి వేశాడు. దీంతో మురుగు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కోరాడ రామారావు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆదివారం స్థానిక ప్రధానోపాధ్యాయుడు కోరాడ రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. రెడ్డిపల్లి అప్పలరాజు, నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లికలను సన్మానించారు. ఈ సందర్భంగా ఈ ఉపాధ్యాయులు పాఠశాలకు అందించిన సేవలను గురించి స్థానికులు కొనియాడారు.

ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 88మంది రోగులకు వైద్యులు టి.జె.మోహన్, టి.జగన్నాథరావు వైద్య పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె.చంద్రశేఖరరావు, సభ్యులు రాంబాబు, శంకర్,రాము, కిశోర్ పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం నుంచి అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. కైలాసగిరి కూడలి నుంచి బయలుదేరి జోడుగుళ్లపాలెం నుంచి బీచ్ రోడ్డులో సీతకొండ మీదుగా సాగర్‌నగర్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కీలకమన్నారు. ఆరోగ్యం దేశాన్ని బలోపేతం చేసి శక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మధరావు, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇదేం చెత్త పని?

మధురవాడలో జాతీయ రహదారిని ఆనుకుని ఎన్‌హెచ్ఏఐ ఏర్పాటు చేసిన కాలువల్లో నిత్యం చెత్త పేరుకుపోయి చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతం మురుగుమయంగా మారుతోంది. దీంతో ఈ ప్రాంత వాసులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవలసిన పాలకులు, అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. కాలువల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించడానికి మాత్రం రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. దీంతో ప్రజా ధనం వృథా అవుతోంది తప్ప ఆశించిన స్థాయిలో ఫలితం లభించడం లేదు.

- చెత్త తొలగింపునకు రూ. 72లక్షలు ఖర్చు
- మధురవాడ జోన్-2లో కొనసా...గుతున్న పనులు
- గతంలో కూడా మరమ్మతులకు రూ. 35లక్షలు ఖర్చు
- రూ.లక్షల వ్యయం.. అయినా లభించని శాశ్వత పరిష్కారం


తాగునీటి పైపులైనులో పేరుకు పోయిన మురుగును తొలగిస్తున్న సిబ్బంది


అసంపూర్తిగా వేసిన పలకలు

మధురవాడ: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాలువల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించే పనులు ప్రారంభించారు. ఈ పనులు చాలాకాలంగా కొనసా..గుతున్నాయి. రూ.72లక్షలు ప్రజా ధనం వృథా అవుతోంది తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. గతంలో కూడా ఈ పనుల కోసం రూ.35 ఖర్చు చేశారని, అవి కూడా బూడిదలో పోసిన పన్నీరుగా మారాయని అంటున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ జోన్-2 కేంద్రం మధురవాడలో జాతీయ రహదారిని ఆనుకుని 5, 6, 7,8 వార్డుల పరిధిలో కొమ్మాది జంక్షన్ నుంచి వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియం వరకు ఇరువైపులా సుమారు 3 కిలో మీటర్ల మేర ఉన్న కాలువల్లో చెత్త తొలగించేందుకు రూ.72 లక్షలు మంజూరు చేశారు. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ పనులు ప్రారంభించగా.. పనులు పూర్తి చేయడానికి మరో రెండు నెలలు పడుతుందని కాంట్రాక్టర్ చెబుతున్నారు. వాస్తవంగా నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కి అధికారులు టెండర్ టైంలో నిర్దేశించారు. అయినా పనులు నెలల తరబడి సాగుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పగటిపూట రద్దీ సమయాల్లో నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తాగునీటి పైపు లైన్ కాల్వల్లోకి మురుగు నీరు చేరుతోంది. దీంతో వ్యాధులు ప్రబలుతాయేమోని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో రూ.35 లక్షలు ఖర్చు

కాలువల్లోంచి మురుగు, వర్షం నీరు సక్రమంగా పారడం లేదు. చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. దీంతో గతంలో సుమారు రూ.20లక్షలు వెచ్చించి కాలువలకు మరమ్మతులు చేశారు. తరువాత మరో రూ. 15లక్షలు వెచ్చించి పకలకు మరమ్మతులు చేశారు. అయినా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

ఇప్పుడు తాజాగా చెత్త తొలగించే పనులు మాత్రమే చేస్తున్నారు. చెత్త తీసి పారివేయడానికి రూ. 72 లక్షలు వెచ్చిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలువలు, పలకల మరమ్మతులు వంటివి లేవు. చెత్త తీసి బయట పడేయడానికి ఇంత పెద్ద మొత్తం ఖర్చు చేయడం ఎవరికి లాభం చేకూర్చడానికి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పూడిక తొలగింపు పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

ఇలా చేస్తే మేలు

ట్రాఫిక్ సమస్య మధురవాడ వాసులను వేధిస్తోంది. కాలువలపై గట్టి పకలు వేసి రోడ్డు విస్తరిస్తే మురుగు సమస్యతో పాటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కాలువలపై ఉన్న


చిన్నగా ఉన్న కాలువల గోడలు


రద్దీ సమయాల్లో పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న సిబ్బంది

పలకలు బలహీనంగా ఉండడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు అనువుగా లేవు. ఇప్పుడు ఎలాగూ పనులు చేపడుతున్నారు కాబట్టి అదనంగా నిధులు వెచ్చించి రోడ్డు విస్తరణకు వీలుగా కాలువలు పునర్నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రతి పక్ష పార్టీలతో పాటు పాలక పక్షానికి చెందిన వారు అభిప్రాయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కాలువలోంచి చెత్త తొలగిస్తున్న యంత్రం


ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ల విస్తరణ కోసం ఇటీవల పరిశీలన చేసిన అధికారులు

ఆకట్టుకున్న కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు


కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లోఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది.నగరంలోని కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. మూషిక వాహన, కాళింది మర్దన, నాగస్తుతి, నారసింహ కౌతం, ఐగిరి నందిని .. నృత్యాంశాలను కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పద కవితా పితా మహుడు అన్నమయ్య రచించిన అదిగో అల్లదిగో..., నారాయణతే నమోనమో వంటి కీర్తనలకు భావయుక్తంగా హావభావాలను ప్రదర్శించి కళాకారులు ప్రేక్షక మన్ననలు అందుకున్నారు.జానపద నృత్యాలలో రాజాం కొండమీద గీతంకు ప్రదర్శించిన నృత్యం హైలెట్‌గా నిలిచింది.దేశ భక్తి గీతాలలో భరత వేదమున.. గీతానికి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కళాకారులు అక్షయ, షణ్ముకప్రియ,నక్షత్ర, రోషిత, జ్యోతికశ్రీ. వేదశ్రీ, సంహిత, సాయిప్రణవి, తదితర చిన్నారులు పాల్గొనగా టి.సందీప్ కుమార్ నృత్య దర్శకత్వం వహించారు.

ఐదో రోజు కొనసాగిన రైతుల నిరసన


సూది కొండ వద్ద మధ్యాహ్న భోజనాలు చేస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సూది కొండ వద్ద తమ అనుమతి లేకుండా సాగులో ఉన్న భూములను ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి కేటాయించడానికి నిరసనగా ఐదో రోజైన ఆదివారం రైతులు వంటా వార్పు చేశారు. సూది కొండ వద్ద రైతులు వంట చేసుకుని మధ్యాహ్న భోజనాలు చేశారు. భూములకు మార్కెట్ రేట్‌కు అదనంగా రెండున్నర రెట్లు, చెట్లకు నష్ట పరిహారం , రైతుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున పరిశ్రమలో ఉద్యోగం ఇస్తామని రెవెన్యూ అధికారులు ప్రకటించేంత వరకు వంటావార్పు నిరసన కార్యక్రమం కొనసాగిస్తామని రైతులు తెలిపారు.

ప్రైవేటు వ్యక్తులకు అడ్డాగా అంగన్‌వాడీ పరిసరాలు


స్వతంత్రనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ముందు పార్కు చేసిన కారు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డులోని స్వతంత్ర నగర్ పెద్ద పార్కుని ఆనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు ప్రైవేటు వ్యక్తులకు, ఆకతాయి అడ్డాగా మారాయి. దీనికి ఎదురుగా కొందరు వ్యక్తులు అనధికారికంగా బడ్డీలు ఏర్పాటు చేయడంతో పాటు, మరికొంత మంది కనీసం లోపలికి వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా వాహనాలు పార్క్ చేస్తున్నారు. సాయంత్రం అయితే ఆకతాయిలు ఇక్కడే చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ చెత్త చెదారం వేసి, అస్తవ్యస్తంగా చేస్తున్నారు. ఎంత శుభ్రం చేసినా ప్రయోజనం ఉండడం లేకుండా పోతోందని నిర్వాహకులు అంటున్నారు. పిల్లలపై కూడా పరిస్థితులు ప్రభావం పడే అవకాశం ఉందని పిల్లలు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వారు వాపోతున్నారు. ప్రహరీ నిర్మించి, చేసి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకుడు ప్రదీప్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు గణితంలో మెలకువలు


గణిత ఉపాధ్యాయుడు దయాసాగర్‌ను సత్కరిస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ఇస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణలో ఆదివారం అనకాపల్లి జిల్లా మామిడిపాలెం జెడ్పీహైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ దయాసాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితంలో మెలకువలు తెలియజేశారు. తేలికగా సమస్యలు పరిష్కరించే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధానకార్యదర్శి రేఖ అప్పారావు, కుమిలి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు వంగపండు దుష్యంత్, ఎల్.ఎ.శ్రీను, వైవీరమణ, కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ తప్పనిసరి


క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు

కొమ్మాది: ప్రతి ఒక్కరూ రోజుకు 30 నిమిషాలైనా తప్పసరిగా సైక్లింగ్ చేయాలని అడిషనల్ ఎస్పీ జి.వి.ఆర్. మధుసూదనరావు తెలిపారు. ఆదివారం రుషికొండలో గల మెరైన్ పోలీస్‌స్టేషన్ వద్ద సైక్లింగ్ క్యాంపెయిన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి సైక్లింగ్‌ను అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు మురళీకృష్ణ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు


నగదు బహుమతులు అందజేస్తున్న రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులు

తగరపువలస: గత విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులకు పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన శ్రీసాహితి స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం రూ.లక్ష నగదు బహుమతులు అందజేశారు. శ్రీసాయి సాహితి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థికి రూ.10వేల చొప్పున అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రెడ్డిపల్లి రమేష్ కుమార్, నిర్మలాదేవి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఎస్.వి.డి. ప్రసాద్, వై.సంతోష్‌కుమార్, గొర్లె రమణ, కె.గౌరినాయుడు, ఎస్.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవ్యాసపూజ సంస్మరణ దినోత్సవం


భక్తులు సమర్పించిన 3,930 రకాల వంటలు


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో శ్రీవ్యాసపూజ సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకుడు, హరేకృష్ణ మహా మంత్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఎ.సి. భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల వారి 129వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరిపారు. భక్తులు తమ ఇళ్లలో 3,930 రకాల వివిధ వంటకాలు తయారు చేసి, శ్రీరాధా మదన్‌మోహన్ మందిరంలో సమర్పించారు. హారతి అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు వేదాంత స్వామి ప్రభుపాదుల జీవిత విశేషాలను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, యదురాజాదాస, అంబరీషదాస తెలియచేశారు.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఓ యువతి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కోరాడ మౌనిక గాయత్రి అనే యువతి తల్లిదండ్రులతో కలిసి శివాజీపాలెంలో నివసిస్తోంది. నగరంలోని ఓ పార్లర్‌లో పనిచేస్తోంది. ఉద్యోగం నిమిత్తం ఈ నెల 21న పార్లర్‌కు వెళ్లిన మౌనిక రాత్రి ఎంతకీ తిరిగి రాలేదు. స్నేహితులు, బంధుమిత్రుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. అనంతరం ఇంట్లో పరిశీలించగా 6 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మౌనిక తల్లి విజయలక్ష్మి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మురుగు ఇలా...ఉండేదెలా ?



తాతాజీనగర్ డ్రైనేజీలో పందుల తిష్ట


శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయానికి కేవలం కిలో మీటరు దూరంలో ఉన్న రేఖవానిపాలెం పంచాయతీలో తాతాజీనగర్ మురుగుమయంగా మారింది. డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. మురుగు కారణంగా రహదారిని గ్రామస్తులు మూసివేశారు. భీమిలి రోడ్డును ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో డ్రైనేజీ శిథిలమై చెరువులా మారిపోయింది. పదుల సంఖ్యలో పందులు ఇందులో నిత్యం తిష్ట వేస్తుండటంతో గ్రామస్తులు మరో దారి చూసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి రెండో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భీమిలిని నిర్వహిస్తున్నా అధికారులు ఇటువైపు చూడడం లేదని తాతాజీనగర్ వాసులు వాపోయారు.

కీటిన్‌పేట ఆంజనేయస్వామి విగ్రహం నుంచి తాతాజీనగర్ మీదుగా మహాలక్ష్మీపురం వరకు రహదారి, డ్రైనేజీలకు మరమ్మతులు చేసి, తమకు మురుగు నుంచి విముక్తి కలిగించాలని వారు వేడుకుంటున్నారు.


మార్గంలో కలిసిపోయిన డ్రైనేజీ


డ్రైనేజీలో తమ స్థలం కలసిపోకుండా ప్రహరీ కట్టుకున్న స్థానికులు

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం


సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత వెంకటనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం ఆటోనగర్‌కి చెందిన జి.వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షల 8 వేల విరాళం చెక్కుని పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

వినాయక బొమ్మల కొలువు


మెరుగులు దిద్దుతున్న శిల్ప కారుడు వెంకట రమణ


పది అడుగుల వినాయక ప్రతిమ

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వినాయక ప్రతిమలు అన్ని హంగులు పూర్తి చేసుకుని అమ్మకానికి సిద్ధమయ్యాయి. పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో కృష్ణాపురం కాలనీ వద్ద ఈ బొమ్మలు కొలువు దీరి ఉన్నాయి. అడుగు నుంచి పది అడుగుల ఎత్తు వరకు ప్రతిమలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన శిల్ప కారుడు పొట్నూరు వెంకట రమణ వీటిని తయారు చేశారు. జూన్ నుంచి ఈ బొమ్మల తయారీలో నిమగ్నమయ్యారు. తనతో పాటు నలుగురికి పనిలో పెట్టుకుని ఈ బొమ్మలు తయారు చేశారు. మూడు నెలల పాటు వీరికి ఉపాధి కల్పించారు. రోజుకు ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున కూలి చెల్లించారు. ప్రతిమలు తయారు చేసేందుకు రూ.4.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్టు వెంకటరమణ తెలిపారు. వంద బొమ్మలు తయారు చేశామని, ఇంత వరకు 23 బొమ్మలు అమ్ముడయ్యాయని చెప్పారు. 16 ఏళ్ల నుంచి వినాయక బొమ్మలు తయారు చేసి అమ్ముతున్నట్టు ఆయన తెలిపారు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగుల వినాయక బొమ్మలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక బొమ్మలు